
కథ

# ఆశ్రమ శ్రావణి

విరించి

ఈ ప్రశ్న చాలాసార్లు వేసుకుంది తను. ఇదొక జవాబు లేని ప్రశ్నగా తయారైంది. భూమి గుండ్రంగా ఉన్నట్లు తిరిగి అదే చోటుకు వస్తోంది. పరంధామయ్య గారి ఏడుగురి సంతానంలో కడగొట్టుది తను. ముగ్గురు అన్నయ్యలు, ఇద్దరు అక్కయ్యల తర్వాత  ముద్దుల చెల్లెలుగా పుట్టిన తనకు,  ఏ ముచ్చట తీరకుండానే తండ్రి చిన్నప్పుడే కాలం చేశాడు. పెద్ద న్నయ్య రామ్మూర్తే నాన్న కరణీకం చేసేవాడు. మండువా లోగిలిలో పట్టు పరికిణీ కట్టుకుని చెంగు చెంగున తను పరుగెడుతోంటే మహారాణిలా చూసేవారు. నాన్నతోటే ఆ మురిపెం కాస్త పోయింది. అప్పటికే అన్న య్యలకు పెళ్ళిళ్ళు అయ్యాయి. పిల్లలు పుట్టారు. రెండో అన్నయ్య రాజా రావు బి. ఇ. డీ. పూర్తి చేసి దగ్గర్లో పట్నంలో స్కూలుకు తీసుకెళ్లేవాడు. తనకేం కావాల్సినా రెండో అన్నయ్యనే అడిగేది. తనని 'చిన్నా' అంటూ గారంగా పిలిచేవాడు. ''ఇంటర్ అవగానే ఇక చదివింది చాల్లే, పెళ్లి చేసేస్తా'' అని పెద్దన్నయ్య అంటే, ''వీల్లేదు. అది డిగ్రీ పూర్తి చేయాల్సిందే'' అని పట్టుపట్టి డిగ్రీ పూర్తి చేయించాడు రెండో అన్నయ్య. అక్కలకు పెళ్ళిళ్ళు అయిపోయాయి. వాళ్ళ సంసారాల్లో వారున్నారు. మూడో, నాలుగోఅన్న య్యలకెతే వాళ్ళ చదువులు, ఫ్రెండ్సు వాళ్ళ ప్రపంచం వాళ్ళది. తన గురించి పట్టించుకునే తీరిక ఎవరికీ లేదు.





''దమయంతీ! ఈ మాత్రేమిటో చూడు. నాకు ఆనట్లేదే'' అమ్మ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిపడింది దమయంతి.

అమ్మకు మాత్ర ఇచ్చి, కంట్లో చుక్కల మందు వేసి, బాల్కనీలోకి వచ్చి కూర్చుంది. వెన్నెల పిండారబోసినట్లుగా వుంది. దక్షిణం వైపు నుండి గోదావరి గాలి రివ్వున వీస్తోంది. అంత ప్రశాంత వాతావరణంలో దమయంతి మనస్సు చిరాగ్గా ఉంది. సెల్ మోగడంతో అందుకుని చూసింది. కృష్ణ మూర్తి! ఈ వేళప్పుడు చేసాడేమిటా అనుకుంటూ సెల్ ఆన్ చేసింది.

''నమస్తే మేడమ్! మిమ్మల్ని డిస్టర్బ్ చేశానా?''

''లేదు. చెప్పండి. ఈ వేళప్పుడు చేశారేమిటి? ఏమిటి విశేషం?'' అంది దమయంతి.

''మీరు ఒంటరిగా ఉన్నారు. ఆలోచనలతో డిప్రెషన్‌లో ఉంటారని నాకు అనిపించింది. ఒకసారి పలకరిస్తే మూడ్ మారుతుందని చేశా''

''థాంక్యూ! నా సమస్య పరిష్కారం లేనిది. అలా అని ఆలోచించకుండా ఉండలేను''

''మీ అమ్మగారిని ఏం చేయాలి అన్నదే కదా మీ సమస్య. ఈ ప్రశ్న మిమ్మల్ని పదేపదే వేధిస్తోంది. అవునా?''

''అవును''

''నేనో పరిష్కారం ఆలోచించాను. మీరు వర్రీ కావద్దు. అన్ని విషయాలు మీకు రేపు ఆఫీసులో చెప్తాను. ఓ.కే.నా?''

''సరే''

''గుడ్‌నైట్ మేడమ్''

కృష్ణమూర్తి చాలా కలుపుగోలు మనిషి. ఆఫీసులో అందరికి తల్లో నాలుకలా వుంటాడు. అందరి బాధలు తనవిగా భావిస్తాడు. నలుగురికి చేతనైన సహాయం చేస్తాడు. తనకంటే పదేళ్ళు పెద్ద. అయినా తననెంతో గౌరవంగా పలకరిస్తాడు. ఎనిమిదేళ్ళ క్రితం ఆనంద్ యాక్సిడెంట్‌లో చనిపోవడంతో కంపాషినేట్ గ్రవుండ్స్ కింద తనకీ ఉద్యోగం వచ్చింది. ఇద్దరూ ఆడపిల్లలే కావడంతో మగదిక్కు లేని తను ఎంతో జాగ్రత్తగా, క్రమశిక్షణగా పెంచింది. పెద్దది శ్రీప్రియ ఇంజనీరింగ్ అవగానే బావనే పెళ్ళి చేసుకుంది. చిన్నది శార్వాణి కాకినాడలో మెడిసిన్ చదువుతోంది. ఇద్దరూ రెండు కళ్ళు తనకు.

దమయంతి ఆలోచనలు మళ్ళీ మొదటికొచ్చాయి. అమ్మనేం చెయ్యాలి? ఈ ప్రశ్న పదేపదే మదిలో మెదులుతూనే వుంది. ఒక్క కొడుకు అమ్మను తీసుకెళ్ళడానికి ఇష్టపడటం లేదు. పెద్దన్నయ్య ''నేనే రిటైరయ్యాను. నేనే నా కొడుకు దగ్గరున్నాను. అమ్మను చూడ్డం నా వల్ల కాదు'' అంటాడు. రెండో అన్నయ్య '' నా కొడుకు అమెరికాలో ఉన్నాడు. నేనే అమెరికా పోదామనుకుంటున్నాను. ఈ ముసలావిడను నేనెలా వుంచుకుంటాను'' అంటాడు. మూడో అన్నయ్య, వదిన టీచర్లు. ''మేమిద్దరం ఉద్యోగస్తులం. చూడ్డం మా వల్ల కాదు'' అంటారు. నాలుగో ఆయన ''ఎవరికీ పట్టనిది నాకేనా?'' అంటాడు. అక్కయ్యలు ''మీ బావ ఒప్పుకోరే'' అంటారు. అంటే తనకు మొగుడు, సంసారం లేదనేగా?

''అమ్మ! గుడ్ న్యూస్. నువ్వు అమ్మమ్మవు కాబోతున్నావ్'' అని శ్రీప్రియ ఫోన్ చేసినా ఒక్క రోజూ చూడ్డానికి వెళ్ళలేక పోయింది తను. ''అందరి పేరెంట్సులా నువ్వు ఒక్కసారి మా కాలేజికి రా అమ్మా!''అని చిన్నది ఎన్నిసార్లు పిలిచినా అమ్మను వదిలి వెళ్ళడానికి కుదరడంలేదు. అమ్మ ఎనభైయ్యోపడిలో పడింది. నడుం వంగింది. కళ్ళు కనపడటం లేదు. కాటరాక్ట్ ఆపరేషన్ చేయించాలి. ''అమ్మమ్మ బాధ్యతలు నీకెందుకు. మామయ్యలు ఉండగా?'' అంటారు పిల్లలు. ఆనంద్ పోయిన కొత్తలో మగ మృగాల నుంచి రక్షణ కోసం అమ్మను తనతో ఉంచుకుంది. ఈ రోజు అందరూ అమ్మకు తమకు సంబంధం లేనట్లు వదిలేశారు. అమ్మను వదిలి ఎక్కడకు వెళ్ళడానికి అవకాశం లేదు తనకు. జీవితంలో తను ఎంతో అలసిపోయింది. తనకూ విశ్రాంతి కావాలి. నాలుగు నెలలు..కనీసం ఓ నెల రోజులు అమ్మను ఎవరైనా తీసుకెళ్తే, తొలిసారి గర్భవతి అయిన శ్రీప్రియను దగ్గరకు తీసుకుని, రకరకాల వంటలతో గోరు ముద్దలు తినిపించేది. ఒక్కసారి శార్వాణి కాలేజికి వెళ్తే అదెంతో గర్వంగా 'మా మమ్మీ' అంటూ అందరికి పరిచయం చేసేది. ఏదీ? తనకెక్కడ ఉందా ఆ అవకాశం. ఒక్కరోజు ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తే అమ్మ గొడవ చేసేస్తుంది. 'ఎక్కడ పెత్తనాలు చేస్తున్నావే? ఆకలేసి ప్రాణంపోతోంది' అంటూ. అక్కడికీ తను ఏర్పాట్లు చేసే ఆఫీసుకెళ్తుంది.

మర్నాడు ఆఫీసుకెళ్ళగానే కృష్ణమూర్తి కనిపించాడు. ''ఈ ఊళ్ళో 'ఆశ్రమ శ్రావణి' అని వృద్ధుల ఆశ్రమం ఉంది. అందులో సుమారు అరవై మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. ఈ వయస్సులో కన్నతల్లి రుణం తీర్చుకునే అవకాశం మీ అన్నయ్యలు మీకిచ్చారు. కాని, చూసే అవకాశం మీకు లేదు. అలా అని, మీ అమ్మగారిని వృద్ధాశ్రమంలో చేర్పించమని చెప్పను. 'చేర్పిద్దామనుకుంటున్నాను' అని మీ అన్నయ్యలకు తెలియచేయండి. వాళ్ళ రియాక్షన్ ఏమిటో చూద్దాం. ఆ తర్వాత మనం నిర్ణయం తీసుకుందాం. ఏమంటారు?'' కృష్ణమూర్తి అడిగాడు.

''అలా తెలియచేయడం వల్ల ఉపయోగం ఏమిటి?'' అడిగింది దమయంతి.

''ఈ రోజు దాకా మీ అన్నయ్యలు,' మా అమ్మ మా చెల్లెలు దగ్గరుంది. అది ఒంటరి కాబట్టి దానికి సాయంగా ఉంటోంద'ని బంధువులకు, స్నేహితులకు చెప్తున్నారు. ఈ రోజు మీరు వృద్ధాశ్రమంలో చేర్పిస్తే కొడుకులు చూడటం లేదు కాబట్టి ఆశ్రమంలో చేర్చారు'అని నలుగురు అనుకుంటే, మీ అన్నయ్యల పరువు పోదూ! అప్పుడైనా తలో మూడు నెలలూ చూస్తాం అంటూ ముందుకు వస్తారు'' అన్నాడు కృష్ణమూర్తి.

దమయంతి మళ్ళీ ఆలోచనలో పడింది. ''ఈ ఐడియా కూడా బాగానే ఉన్నట్లుంది. కానీ, అన్నయ్యకు, అక్కయ్యలకు కోపం వస్తుందేమో. మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా? పెద్ద తెలివైనదానివనుకుంటున్నావా? ఒంటరిగా ఉన్నావు కదా- పోన్లే తోడుగా ఉంటుందని నీ దగ్గర ఉంచాం. మా అమ్మను వృద్ధాశ్రమంలో చేర్చాల్సిన గతేం పట్టలేదని'' అరుస్తారేమో.

''మీరేం టెన్షన్ పడకండి మేడమ్. ఇది చిన్న ట్రిక్. మీ అన్నయ్య, అక్కల్లో ఒక్కరికైనా మానవత్వం ఉంటే స్పందిస్తారు. లేదా, ఆ భగవంతుడే ఉన్నాడు. అంతా కాలమే నిర్ణయిస్తుంది'' కృష్ణమూర్తి ఏదో మాట్లాడుతున్నాడు.


కృష్ణమూర్తి ఇచ్చిన ' ఆశ్రమ శ్రావణి' అప్లికేషన్ తీసుకుని పూర్తి చేసింది. సాయంత్రం ఓ గంట పర్మిషన్ తీసుకుని పెందరాళే ఇంటికొచ్చింది. స్నానం చేసి, టీ తాగి ఫ్రెషప్ అయ్యాక కాగితం, పెన్ను తీసుకుని తనకిష్టమైన బాల్కనీలో కూర్చుంది. తను ఉత్తరాలు మానేసి చాలా కాలమైంది. మళ్ళీ ఇన్నాళ్ళకు..

''ప్రియమైన అన్నయ్యకు, అక్కయ్యకు,

మీ ప్రియాతి ప్రియమైన చెల్లెలు దమయంతి రాయునది

ఉభయకుశలోపరి.

ఈ మధ్య అమ్మ ఆరోగ్యం బాగుండటం లేదు. దగ్గర మనిషి లేనిదే బాత్‌రూమ్ కూడా వెళ్ళలేకపోతోంది. నాకు ఆఫీసులో పని ఎక్కువగా వుంది. శ్రీప్రియకు శ్రీమంతం చేయాలి. పురిటికి తీసుకురావాలి. మీరందరూ వయస్సులో పెద్దవాళ్ళు. మీ సమస్యలు మీకున్నాయి. అమ్మను చూసే అవకాశం మీకు లేదని నాకు తెలుసు. నాకు కూడా విశ్రాంతి కావాలి. అందుకే నేనో పరిష్కారం ఆలోచించాను. దీంతో, 'ఆశ్రమ శ్రావణి' అప్లికేషన్ పంపిస్తున్నాను. మీకు అంగీకారం అయితే సంతకం పెట్టి



పంపించండి. చిన్నదాని ఆలోచన తప్పయితే క్షమించండి.

ఇట్లు
మీ చెల్లెలు,
దమయంతి''

ఉత్తరాన్ని రెండు మూడు సార్లు చదివి, వాటికి ఓ అరడజను జిరాక్స్ కాపీలు తీయించి ఆరుగురికీ కొరియర్‌లో పంపించింది.

మర్నాటి నుంచి దమయంతికి ఒకటే టెన్షన్. ఈపాటికి అందే ఉంటుంది. పెద్దన్నయ్య ఏమంటున్నాడో, కోపంగా అరుస్తున్నాడా? పెద్దక్కయ్య ఏమంటోంది? ' ఇది పెద్ద ఆరిందా అయిపోయిందే?' అంటోందా? రెండో అన్నయ్య ఏమంటున్నాడో! ఎంతో ముద్దుగా చూసిన తనను కూడా లెక్క చేయకుండా ఇలా రాస్తుందా అనుకుంటున్నాడా? రోజూ ఇదే ఆలోచనలతో గడుపుతోంది దమయంతి. వారం.. రెండు వారాలు..నెల..రెండు నెలలు.. ఒక్కరి దగ్గర్నుంచీ జవాబు గానీ, ఫోన్ గానీ రాలేదు. రెండు నెలల తర్వాత పెద్దక్కయ్య ఫోన్ చేసింది. ''అన్నయ్యలు ఎవరైనా మాట్లాడారా?'' అంటూ. ఆఖరి అన్నయ్య మాత్రం ఫోన్ చేశాడు. ''పల్లెటూర్లో ఉన్న ఆ మండువా ఇల్లు, నాలుగు ఎకరాల పొలంని ఐదు వాటాలు చేసి, అమ్మను ఎవరు చూస్తే వాళ్ళు అమ్మ వాటా తీసుకోండి''అని. తను మాత్రం అమ్మని చూడడు.

దమయంతికి ఏమిచేయాలో పాలుపోవడం లేదు. అప్పుడప్పుడు ఫోన్ చేసే అన్నయ్యలు, అక్కయ్యలు ఫోన్ కూడా మానేశారు. వాళ్ళందరికీ కోపం వచ్చినట్లుంది. ఇప్పుడేం చెయ్యాలి. కృష్ణమూర్తి చెత్త ఐడియా ఇచ్చాడా? మిస్‌ఫైర్ అయిందా?

ఉదయం ఆఫీసుకెళ్ళగానే కృష్ణమూర్తి కనిపించాడు.

''గుడ్ మార్నింగ్ మేడమ్''

''గుడ్‌మార్నింగ్''

''ఎవరైనా రెస్పాండ్ అయ్యారా?'' కృష్ణమూర్తి కుతూహలంగా అడిగాడు.

''ప్చ్'' పెదవి విరిచింది దమయంతి.

''ఓ.కె! నేననుకున్నట్లు జరిగింది. వాళ్ళు దేనికీ 'యస్' అనరు. అలా అని అమ్మని చూడరు. సరే! మీకభ్యంతరం లేకపోతే సాయంత్రం 'ఆశ్రమ శ్రావణి'కి వెళ్దాం రండి''

''ఎందుకు?''

''జీవన సంధ్యలో ఉన్న ఎందరో అమ్మలు, నాన్నలు అక్కడ ఉన్నారు. వాళ్ళను ఒకసారి చూస్తే జీవితం ఎంత విచిత్రమైనదో, మానవ సంబంధాలన్నీ ఎంత స్వార్థపూరితమైనవో మనకర్థమవుతుంది'' అన్నాడు.

దమయంతి ఒక్క క్షణం ఆలోచించింది. అయిన వాళ్ళందరూ వదిలేసినా తన క్షేమ సమాచారాలు తరచూ కనుక్కొని, సరైన సలహాలు ఇచ్చేవాడు కృష్ణమూర్తి ఒక్కడే.

''సరే'' అంది.

సాయంత్రం ఆఫీస్ అవగానే ఇద్దరూ ఆటో మీద బయల్దేరారు. దారిలో బుట్టెడు బత్తాయిలు కొన్నాడు కృష్ణమూర్తి.

''ఇది దేనికి?'' అడిగింది దమయంతి.

''చెప్తా'' నవ్వాడు కృష్ణమూర్తి.

ఊరుకు చివర విసిరివేయబడ్డట్టుగా ఉంది 'ఆశ్రమశ్రావణి'. మామిడితోటల్లో, కొబ్బరి చెట్ల మధ్య, గోదావరి తీరాన ఉంది. చక్కటిలాన్స్, రకరకాల పూల మొక్కలు..చాలా ఆహ్లాదకరంగా ఉంది.

ఆటో దిగగానే కృష్ణమూర్తే డబ్బులిచ్చాడు. ముందు కృష్ణమూర్తి నడుస్తుంటే, దమయంతి పరిసరాల్ని చూస్తూ లోపలికి అడుగుపెట్టింది.

''నమస్కారం కృష్ణమూర్తి గారూ!'' ఆ కంఠం వినగానే అటుకేసి చూసింది దమయంతి.

తెల్లని లాల్చీ పైజమాలో, తెల్లటి పొడవాటి గడ్డంలో, దబ్బ పండు ఛాయలో పొడుగ్గా ఉన్న ఓ పెద్దాయన కృష్ణమూర్తిని పలకరించాడు.

''నమస్కారం స్వామీ'' అన్నాడు కృష్ణమూర్తి.

''ఈయన దయానందంగారు. ఈ ఆశ్రమ నిర్వాహకులు. ఈమె దమయంతి గారు, మా కొలీగ్'' పరిచయం చేశాడు.

నమస్కారాలయ్యాక ''ఈరోజు దమయంతి గారి పుట్టిన రోజు. పెద్ద వాళ్ళందరి ఆశీర్వచనం కోసం వచ్చారు'' అన్నాడు కృష్ణమూర్తి, బుట్టెడు బత్తాయిలు రిసెప్షన్‌లో పెడుతూ.

దమయంతి ఆశ్చర్యంగా చూసింది. తనకు తెలియని తన పుట్టినరోజు కృష్ణమూర్తికి ఎలా తెలిసిందా అని. కృష్ణమూర్తి కళ్ళతో సంజ్ఞ చేశాడు మాట్లాడొద్దని.

''సంతోషం. రండి'' దయానందంగారు ఆహ్వానించారు.

ఆశ్రమం చాలా బాగుంది. విశాలమైన స్థలంలో.. రకరకాల పూల మొక్కలతో..విరిసే పువ్వులు, ఎగిరే గువ్వలు, బోసి నవ్వులు..వీటికి మించిన అందం ఏముంటుందీ ప్రపంచంలో.

కొంతమంది వృద్ధులు లాన్స్‌లో కూర్చున్నారు. ఓ పక్క చిన్న లైబ్రరీ, ఆ తర్వాత పూజా- కం-భజన మందిరం. ఆ పక్క డైనింగ్‌హాల్, కొంచెం ముందుకెళ్తే వంటశాల..కొంచె ముందు కెళ్ళి కుడి పక్కకు తిరిగితే చిన్న చిన్న గదులు.. గదికి ఇద్దరు వృద్ధులు.. ఆ పక్కనే చిన్న క్లినిక్.

దయానందం గారూ అన్నీ ఒక్కొక్కటి చూపిస్తూ చెబుతున్నారు. దమయంతి అన్నీ ఆసక్తిగా వింటోంది. ఎందరో వృద్ధులు.. ఎన్నో హృదయ విదారక గాథలు..పిల్లలు లేక.. ఉన్నా చూడక.. విదేశాల్లో ఉండి చూసే అవకాశం లేక.. రకరకాల సమస్యలు.

'దయచేసి ఎవరి వ్యక్తిగత విషయాలు అడగకండి' విజిటర్స్‌కి చిన్న విజ్ఞప్తి. బోర్డుపై పెద్ద అక్షరాల్తో రాసుంది.

''నిజమే కదా వాళ్ళ విషయాల్ని అడిగి, వాళ్ళ బాధని తవ్వి, మరిచిపోతున్న విషయాల్ని గుర్తు చేయడం, మానుతున్న గాయాన్ని రేపడం లాంటిది'' అనుకుంది దమయంతి.

అరవై ఏళ్ళ వయసు నుంచి చాలా పెద్ద వయస్సు వరకూ ఉన్నారు. ఓ గదిదాకా వచ్చారు. ఓ పండు ముసలాయన. జీవితం నేర్పిన అనుభవాలు దొంతరలా ఉన్నాయి ఆయన శరీరం ముడతలు. పచ్చని దేహచ్ఛాయ. చిక్కి శల్యమైన




## తెరపై అబ్రహం లింకన్ జీవిత చరిత్ర

**హాలీవుడ్** దర్శక దిగ్గజం స్టీవెన్ స్పీల్‌బర్గ్ చిత్రాల గురించి తెలియని వారుండరు. దర్శకులకు మార్గదర్శకం ఆయన సృష్టించిన చిత్రాలు. ఇపుడు తాజాగా యు.ఎస్. మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్ జీవితాన్ని తెరకెక్కించే ప్రయత్నాల్లో ఉన్నారు. అబ్రహం లింకన్ జన్మించి రెండు వందల యేళ్ళు అవుతున్నాయి. అతని పుట్టినరోజున సినిమా రిలీజయ్యేలా రూపకల్పన చేసుకుంటున్నారు స్పీల్‌బర్గ్. ప్రస్తుతం 'టిన్‌టిన్' అనే కామిక్ కార్టూన్‌పై సినిమా తీస్తున్నారు. సెప్టెంబర్ వరకు సినిమా షూటింగ్ కొనసాగుతుందని, ఆ సినిమా అనంతరం 2009లో అబ్రహం లింకన్ సినిమా ప్రాజెక్టు మొదలవుతుందని స్టీవెన్ తెలిపారు.

## వాట్సన్ గొప్ప అందగాడు

మోడలింగ్, సినిమా రంగాల్లో వున్న వారికి ఈ మధ్య రాజకీయ నాయకులు, క్రికెటర్లూ తెగ నచ్చేస్తున్నారు. మొన్నామధ్య ఓ విదేశీ మోడల్ పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ సెక్సీగా వుంటాడు. ఆయనతో డేటింగ్ చేయాలనుందని ఏకంగా పత్రికలకెక్కింది. ఐపీఎల్ టోర్నీలో ప్రీతిజింతా తన జట్టు ఆటగాళ్ళను ఉత్సాహ పరిచేందుకు ముద్దాయణం సాగించింది. ఇపుడు ఇటువంటి విషయాలు సర్వ సాధారణమయ్యాయి. ప్రముఖ బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఐపీఎల్ మ్యాచ్‌లను తిలకించడానికి వచ్చింది. సెన్సేషన్ కోసమో లేక నిజంగా ఏర్పడిన అభిమానమో తెలియదు గానీ.. ఆస్ట్రేలియన్ ఆల్‌రౌండర్ షేన్‌వాట్సన్‌ను చూసి, చూపు మరల్చుకోలేకపోయిందిట. అలా చూస్తూనే ఉండిపోయిందిట. ఇదిలా వుంటే, ''ఇండియాలో నాపై చూపించిన ప్రేమ, అభిమానాలు మరువలేనివి. స్వదేశంలో పొందలేని అనుభూతుల్ని ఇక్కడ పొందుతున్నాను. ఇండియా ఈజ్ రియల్లీ గ్రేట్ అని'' వాట్సన్ ప్రశంసల జల్లు కురిపించాడు. విద్యాబాలన్ చూపుల్లో దాగున్న అర్థమేమిటో? అని ఏదేదో ఊహించుకుని అపార్థం చేసుకోకండి. అభిమానమే అనుకుంటే ఏ గొడవా వుండదు.



దేహం. లేవలేక, కూర్చోలేక చాలా ఇబ్బంది పడుతున్నాడు. ఆశ్రమం అటెండర్ ఆయనకు పంచె కడుతున్నాడు.

''ఈయన సుబ్బరాజు గారు. వయస్సు నూట ఐదేళ్ళు. ఈయన కొడుకులు, మనవలు కూడా రిటైరై పోయారు. ఆస్తి ఉన్నా చూసే దిక్కులేక ఈ ఆశ్రమంలో చేరారు''

దయానందంగారు నెమ్మదిగా చెప్తున్నారు. ఇంకొంచెం ముందుకు వెళ్ళారు. చిన్నగా మూలుగు వినిపిస్తోంది. ఆ గది ముందు ఆగారు.

''అమ్మా! సావిత్రమ్మ గారు! ఎలా ఉన్నారు?'' దయానందం గారు అడిగారు. ఆ గదిలో ఓ పెద్దామె ఉంది. ఓ ఎనభై ఏళ్ళుంటాయి. గదిలో నడవలేక ఆమె దేకుతోంది. కృష్ణమూర్తి చేతుల్తో ఆమెను లేపి మంచం మీద కూర్చోబెట్టాడు.

''కృష్ణమూర్తి బాబు కదూ!'' అందామె. ఆమెకు చూపు సరిగా ఆనట్లేనట్లుంది.

''అవునమ్మా'' అన్నాడు కృష్ణమూర్తి.

''నీకున్నపాటి జాలి కూడా నా కొడుక్కి లేకపోయింది కదా!'' నిట్టూర్చిందామె.

''మీకేమవుతుంది?'' దమయంతి ఆశ్చర్యంగా అడిగింది కృష్ణమూర్తిని.

''మానవత్వమే వారి బంధుత్వం''అన్నారు దయానందం గారు.

''అంటే?''

''ఇక్కడ ఎవరూ ఎవరికీ ఏమీకారమ్మా. కృష్ణమూర్తిగారు ఈ ఆశ్రమవాసులందరికీ చిరపరిచితులే. ప్రతీ ఆదివారం ఆయన ఆశ్రమసేవ చేస్తూ ఉంటారు. అందర్నీ ఆప్యాయంగా పలకరించడం, వారి యోగక్షేమాలు కనుక్కోవడం, మందులు మాకులు ఇవ్వడం ఆయన క్రమం తప్పకుండా చేస్తారు. ఆయన మాలో ఒక్కడు'' అన్నారు దయానందంగారు.

ఆశ్చర్యంగా చూసింది దమయంతి.

''ఇద్దరు వృద్ధులను దత్తత తీసుకుని, వారికి నెలకు అయ్యే ఖర్చు మొత్తం ఆయనే కడతారు'' దయానందం గారు చెప్తున్నారు.

కృష్ణమూర్తి తనకేనాడు ఈ విషయాలు చెప్పలేదు. అదీ గోరంత చేసి కొండంతగా చెప్పుకునే ఈ రోజుల్లో. వృద్ధుల్ని దత్తత తీసుకుని వారి సేవ చేయడం..నిజంగా ఎంత గొప్ప మనస్సు. మనస్సులోనే కృష్ణమూర్తిని అభినందించింది.

ఆ ముసలామెను ఎక్కడో చూసినట్లుగా ఉంది.

''ఆమె పేరు సావిత్రమ్మ గారు. ఎనభై ఏళ్ళు ఆమెకు. నలుగురు కొడుకులు. పెద్దాయన హైద్రాబాదు, రెండో ఆయన బెంగుళూరు, మూడో ఆయన చెన్నైలో ఉంటారు. నాలుగో ఆయన 'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డు గ్రహీత. ఈ ఊళ్ళోనే ఉంటారు. మొదటి ముగ్గురు తలో మూడు నెలలు చూస్తారు. ఈ వయస్సులో ఆమె ప్రతి మూడు నెలలకు సిటీ మారుతూ ప్రయాణం చేయవలసిందే. నాలుగో ఆయన తన వాటా మూడు నెలలు ఈ ఆశ్రమంలో ఉంచుతాడు. ఆయనకు ఒక్కడే కొడుకు. ఈ ఉత్తమ ఉపాధ్యాయుడు వృద్ధాప్యంలో ఇక్కడకు రావాల్సిందే'' అన్నారు దయానందంగారు.

ఇప్పుడర్థమైంది దమయంతికి. ఆమె తన ఇంటికి నాలుగు ఇళ్ళ అవతల ఉండే సుందరం మాష్టారు తల్లి అని. ఆ తల్లి భర్తపోతే నాలుగు ఇళ్ళలో పాచి పని చేసుకుని, నీళ్ళు మోసి, రాత్రిళ్ళు ఇంటింటికి తిరిగి అన్నం తెచ్చి ఈ నలుగుర్ని పెంచి, పోషించి పెద్దవాళ్ళని చేసింది. ఆమె నవమాసాలు మోసి, కని, పెంచి చేసినందుకు ఈ విధంగా ఆశ్రమం పాలు చేశారు. ఆ తల్లి కూడా ఒక్కొక్కళ్ళని మూడు నెలలు మించి 'నవమాసాలు నేను మోయలేను' అని మూడు నెలలకే దించేసుకుని ఉంటే..లేదా కని అనాథాశ్రమ వాకిట్లో వదిలేసి ఉంటే..అమ్మ గర్భాశయానికి, అమ్మ పాలకి, ఆలనాపాలనకి, అమ్మ పెట్టిన గోరు ముద్దలకి, అమ్మ కష్టానికి, త్యాగానికి.. ఈవిధంగా వెలకట్టే రుణం తీర్చుకుంటున్న వీళ్ళు మనుష్యులా.. దమయంతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''కృష్ణమూర్తి గారూ, వెళ్ళిపోదాం పదండి'' అకస్మాత్తుగా అంది దమయంతి.

''మరి ఈ బత్తాయిలు అందరికీ ఇవ్వొద్దా?'' కృష్ణమూర్తి అడిగాడు.

దమయంతి మాట్లాడలేదు.

దమయంతి ముఖ కవళికలు తను ఊహించినట్లుగా మారడాన్ని అతను గమనించాడు. తనకు కావాల్సింది అదే.

దయానందం గారికి కృతజ్ఞతలు చెప్పి ఆటో ఎక్కారు ఇద్దరూ. దారి పొడుగునా ఒక్క మాట మాట్లాడలేదు దమయంతి.

ఇల్లు రాగానే ఆటో దిగుతూ అంది. ''థాంక్యూ! కృష్ణమూర్తిగారు. నా సమస్యకు ఓ చక్కని పరిష్కారం చూపారు. అమ్మ రుణం తీర్చుకునే అవకాశం నాకు ఒక్కదానికే ఇచ్చినందుకు మా అన్నయ్యలకు, అక్కయ్యలకు ఈ రోజే కృతజ్ఞతలు తెలియచేస్తా. అమ్మ నాతోనే ఉంటుంది. ఒన్స్ ఎగైన్ థ్యాంక్స్''

ఓ దృఢ నిర్ణయానికి వచ్చిన దానిలా ముందుకు నడిచింది దమయంతి. ''అమ్మను నేనే దత్తత తీసుకుంటా''దృఢంగా అనుకుంది.

★